ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 35.0 | కనిష్ఠం : 23.0
ANDHRAJYOTHY
5
నాగర్‌కర్నూల్
జిల్లా వార్తలు
ఆదివారం 10 మార్చి 2024



# ఇసుక బంగారం

## మహబూబ్‌నగర్ జిల్లాలో తీవ్ర కొరత

- నిలిచిన నిర్మాణాలు
- ఒక్కో లారీ శాండ్ ధర రూ.43 వేల నుంచి రూ.45 వేలు
- అర్ధరాత్రి వేళ తరలించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులు
- ఆన్‌లైన్ ద్వారా ఇసుక ఇవ్వాలంటున్న ప్రజలు



మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిల్వ ఉంచిన ఇసుక

మహబూబ్‌నగర్, మార్చి 9: తులం బంగారం ధర రూ.60 వేలు ఉండగా.. ఒక బెంజ్(లారీ) ఇసుక ధర రూ.43 వేల నుంచి రూ.45 వేలు ఉంది. అంటే ఇసుక ధర బంగారం ధరతో పోటీ పడుతోంది. రెండు మూడు నెలల్లోనే ధరలు రెండింతలయ్యాయి. ధరలు పెరిగినా ఇసుక దొరకని పరిస్థితి నెలకొంది. ఇసుక కొరతతో నిర్మాణ రంగం కుదేలవుతోంది. ఎన్నో ఆశలతో ఇంటి నిర్మాణాలు చేపడుతున్న వారు ఇసుక లేని కారణంగా నిర్మాణాలను మధ్యలోనే ఆపేస్తున్నారు. నిర్మాణ రంగం స్తంభించిపోవడంతో భవన నిర్మాణ రంగ కార్మికులకు పనులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలవారీ ఖర్చులకు, చీటీ డబ్బులకు అవస్థలు పడుతున్నారు. ఇదే అదనుగా భావించిన అక్రమార్కులు రాత్రికి రాత్రి బెంజ్ లారీలతో ఇసుక డంప్‌లు చేసి, సొమ్ము చేసుకుంటున్నారు. ఇదివరకు రూ.25 వేల నుంచి రూ.27 వేలు పలికే బెంజ్ ఇసుక ధర.. ఇప్పుడు రూ.43 వేల నుంచి రూ.45 వేలు పలుకుతోంది. అది కూడా పలుకుబడి ఉన్నవాళ్లకే అందుతోంది.

### అక్రమ రవాణాకు అడ్డుకట్ట

పాలమూరు జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను ప్రభుత్వం మారిన తరువాత యంత్రాంగం పూర్తి స్థాయిలో కట్టడి చేసింది. ఇదివరకు ఎన్ని రకాల చర్యలు తీసుకున్నా.. ఎక్కడో ఒకచోట నుంచి ఇసుక వచ్చేది. ఇప్పుడు అన్ని ప్రధాన వాగుల నుంచి ఇసుక అక్రమ రవాణాను నియంత్రించారు. జిల్లాలోని కోయిలకొండ, మక్తల్, దుందుభీ, పెద్దమ్మ, క్రిష్ణా, అలంపూర్ వాగుల నుంచి వచ్చే ఇసుకపై యంత్రాంగం నజర్ వేసింది. ముందుగా వాగుల ఇసుకను కట్టడి చేసి, ఆ తరువాత ఫిల్టర్ ఇసుకపై దృష్టి సారించారు. ఇళ్ల వద్ద, వ్యవసాయ పొలాల వద్ద ఫిల్టర్ ఇసుక తయారీని కుటీర పరిశ్రమగా చేసుకుని దందా సాగించే వాళ్లను ఎక్కడికక్కడ నియంత్రించారు. ఫిల్టర్ ఇసుక తయారుచేసే ట్రాక్టర్ల యజమానులను పిలిచి బైండోవర్ చేయడం, లేదంటే ట్రాక్టర్లను తెచ్చి పోలీస్ స్టేషన్‌లలో పెట్టడంతో ఫిల్టర్ దందా చాలావరకు బంద్ అయ్యింది. దాంతో ఇసుక కొరత ఏర్పడింది.

### ఆన్‌లైన్ ఇసుక ఇవ్వాలంటున్న జనం

ఇసుక కొరత కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న వారు ప్రభుత్వం ఆన్‌లైన్ ఇసుకను సరఫరా చేయాలని కోరుతున్నారు. జిల్లాలో కొన్ని వాగులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వగా, ఆన్‌లైన్ సైట్ మూసి వేయడంతో అక్కడా ఇసుక దొరికే పరిస్థితి లేదు. ఆన్‌లైన్ సైట్ అప్పుడప్పుడు ఓపెన్ చేసి, వెంటనే బంద్ చేస్తున్నారని తెలుస్తోంది. వారికి కావలసిన వారికోసం కొద్దిసేపు ఓపెన్ చేసి, వెంటనే బంద్ చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా 600 ట్రాక్టర్ ట్రిప్పుల వరకు ఇసుక కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఇసుక సరఫరా చేస్తే ప్రభుత్వానికి మంచి ఆదాయం రావడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది.

### రాత్రికి రాత్రి

అక్రమార్కులు కొందరు రాత్రికి రాత్రి ఇసుక రవాణా చేస్తూ, రూ.లక్షలు వెనకేసుకుంటున్నారు. ఒక రాత్రి యంత్రాంగం కళ్లు మూస్తే రూ.10 లక్షల దందా చేస్తున్నారు. కొందరు పైరవీలతో నాయకులను, అధికారులను మేనేజ్ చేసి.. వారానికి, పది రోజులకు ఓ రోజును ఎంచుకుని బెంజ్ లారీలతో ఇసుక సరఫరా చేస్తున్నారు. ముందుగానే నిర్ణయించుకున్న చోట డంప్ చేసి వెళ్తున్నారు. ఇటీవల కోయిలకొండ వాగు నుంచి ఇలానే ఇసుకను డంప్ చేశారన్న ప్రచారం జరిగింది. లారీ ఇసుక ధర రూ.43 వేల వరకు డిమాండ్ ఉండటంతో అర్ధరాత్రి తరువాత లారీలు రోడ్డెక్కుతున్నాయి. రెండు, మూడు నెలలుగా ఇసుక లభించకపోవడంతో నిర్మాణాలు ఆగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎంత ఖర్చయినా ఫర వాలేదు ఇసుక దొరికితే చాలని కొందరు రేటుకు వెనుకాడకపోవడంతో డిమాండ్ పెరిగింది. మరికొందరు ఇసుకకు ప్రయత్యామ్నాయంగా డస్ట్(రాతి పొడి)ను వినియోగిస్తున్నారు. హైదరాబాద్‌లో ఫ్లైఓవర్‌లకు డస్ట్ వినియోగిస్తున్న తరహాలో అవగాహన ఉన్న కొందరు ఇసుక స్థానంలో డస్ట్‌ను వాడే ప్రయత్నాలు చేస్తున్నారు. పాలమూరు పట్టణం, జడ్చర్లతోపాటు ఇటీవల అమిస్తాపూర్ గ్రామంలో రెండు ఇళ్లను పూర్తిగా డస్ట్‌తోనే నిర్మాణం చేసినట్లు తెలిసింది. కొందరు సగం స్లాబ్ వేసి, ఇసుక లేక మధ్యలోనే నిర్మాణాలు ఆపేసిన వారున్నారు.



మాగనూరు మండలం వర్కూరులో ఇసుక డంపును సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు(ఫైల్)



దుందుభి వాగులో నిల్వ చేసిన ఇసుక

### కార్మికులకు తప్పని తిప్పలు

భవన నిర్మాణ రంగంలో పని చేసే కార్మికులు భార్యాభర్త రోజూ పని చేస్తే రూ.1,500-1,800 వరకు సంపాదిస్తారు. నెలవారీగా ఈ డబ్బులతో ఇంటి ఖర్చులు పోను, పొదుపు కోసం చీటీలు వేసుకుంటారు. రెండు నెలలుగా ఇసుక కొరత కారణంగా పనులు లేక ఖర్చులతో పాటు చీటీ డబ్బుల కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఎలాగైనా తమకు పనులు చూపాలని మేస్త్రీలు ఇంటి యజమానుల వెంట పడుతున్నారు. బాగా డిమాండ్ ఉన్న మేస్త్రీలు కూడా తక్కువ ఖర్చుతోనే నిర్మాణం చేస్తామని అగ్రిమెంట్‌లు చేసుకుంటున్నారు.



ఓ ఇంటి వద్ద డంప్ చేసిన ఇసుక

## ఉరి వేసుకొని భార్యాభర్తల ఆత్మహత్య



మంటు, సంజు(ఫైల్)

కోస్గి రూరల్, మార్చి 9 : భార్యాభర్తలు ఇద్దరు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణంలో శనివారం చోటుచేసుకున్నది. ఈ ఘటనకు సంబంధించి హెడ్‌కానిస్టేబుల్ మనోహర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రానికి చెందిన మంటు(27), సంజు కుమారి (23) భార్యాభర్తలు. వారిద్దరు జీవనోపాధి కోసం కోస్గికి వచ్చారు. రైస్‌మిల్లులో పనిచేస్తూ ఉండే వారు. పట్టణంలోని ఏటీకే ఫంక్షన్ హాల్ సమీపంలో వెంకటయ్య అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. ఈక్రమంలో శనివారం సాయంత్రం అద్దె ఇంట్లో ఇద్దరూ ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇది గమనించిన ఇంటి యజమాని పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న సీఐ సోమనర్సయ్య ఘటనకు సంబంధించిన వివరాలను సేకరించారు. మృతదేహాలను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇంటి యజమాని వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

## జీవో నెంబర్ 3 తెచ్చింది కేసీఆర్ ప్రభుత్వం

- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క



విల్లు ఎక్కుపెట్టిన మంత్రి సీతక్క

అచ్చంపేట, మార్చి9: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే జీవో నంబర్ 3ను తెచ్చారని, ఆ ప్రభుత్వంలో మహిళలంటే గౌరవం లేకున్నదని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో అనుష ప్రాజెక్టు లిమిటెడ్ అధినేత జలేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ తమ ప్రభుత్వం వచ్చిన 80 రోజుల్లోనే యువతకు 40 వేల ఉద్యోగాలు ఇచ్చామన్నారు. జీవో నంబర్ 3పై కవిత మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక్క మహిళకు కూడా మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన మొదట్లోనే మహిళలకు పెద్ద పీట వేస్తూ ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిందన్నారు. అధికారం పోయిందన్న అక్కసుతో ఆటోవాళ్లను రెచ్చగొట్టారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష మంది మహిళలతో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి, ముఖ్యమంత్రి తీపి కబురు చెప్పనున్నారని చెప్పారు. పోడు భూములకు త్వరలోనే పట్టాలు ఇస్తామన్నారు. ఈనెల 11న భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. మాచారం గ్రామానికి చెందిన జలేందర్ రెడ్డి సేవా దృక్పథం ఆదర్శం కావాలన్నారు. ఈ సందర్భంగా జీవో నెంబరు 3ను పునరుద్ధరించాలని, ఏజెన్సీ ప్రాంతంలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను స్థానిక గిరిజనులతోనే భర్తీ చేయాలని గిరిజన సంఘం ఆధ్వర్యంలో మంత్రి సీతక్కకు శనివారం వినతి పత్రం ఇచ్చారు.

### జలేందర్ రెడ్డి రియల్ శ్రీమంతుడు: వంశీకృష్ణ

తాను పుట్టిన మారుమూల గ్రామం మాచారం అభివృద్ధికి రూ.ఐదు కోట్లకు పైగా ఖర్చు చేసి.. బడి, గుడి, రోడ్లను బాగుచేయడమే కాకుండా ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. మద్దిమడుగు నుంచి పదర మీదుగా రూ.55 కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. అమ్రాబాద్ ఉమ్మడి మండల విద్యుత్ సమస్యను అధిగమించేందుకు కావాలని, అదేవిధంగా మండలానికి సాగునీరు అందించేందుకు మంత్రి సీతక్క సహకారం అవసరమన్నారు. కార్యక్రమంలో శంకరణ్ నేత్రాలయ ఫౌండేషన్ మొబైల్ ఐసర్వీస్ ఇన్‌చార్జి అరుణ్ కుమార్, వైద్యులు గజేంద్ర కుమార్ వర్మ, అభిదత్, 22 మంది బృందం సభ్యులు పాల్గొన్నారు.

# కరిగిపోతున్న గుట్టలు



అమిస్తాపూర్ శివారులో నల్లగుట్టను తవ్వుతున్న ఎక్స్‌కవేటర్(ఫైల్)

- అనుమతులు లేకుండా తవ్వేస్తున్న మాఫియా
- భూమి చదును కాగానే ఆక్రమించి వెంచర్ల ఏర్పాటు
- ధ్వంసమౌతున్న చెట్లు.. పట్టని అధికారులు

భూత్పూర్, మార్చి 9: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న భూత్పూర్ మండలంలో గుట్టలు కరిగిపోతున్నాయి. ఇళ్లు, భవనాల నిర్మాణాలకు మట్టి అవసరం ఉండటంతో రియల్ ఎస్టేట్ మాఫియా దానిని కొల్లగొడుతోంది. ఎలాంటి అనుమతులు లేకుండా లారీల్లో మట్టిని తరలిస్తూ, సొమ్ము చేసుకుంటోంది. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతోంది. కొండలను తవ్విన తర్వాత ఖాళీ అయిన ప్రాంతంలో కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించి, వెంచర్లు ఏర్పాటు చేస్తున్నారు. భూత్పూర్ శివారులోని నక్కల బండ తండా దగ్గర సర్వే నంబరు 314లో గుట్ట ఉంది. 26 ఎకరాల్లోని ఈ గుట్ట నుంచి నిత్యం మట్టిని తరలిస్తున్నారు. వందలాది లారీలతో మట్టిని తీసుకెళ్తున్నారు. తండా సమీపంలోని కతివాని చెరువు దగ్గర ఉన్న గుట్ట, కొత్తమొల్గర ప్రాంతంలో ఉన్న మూర్తయ్య గుట్ట, గుబ్బడి తండా దగ్గర ఉన్న గుట్ట నుంచి కూడా మట్టిని తరలిస్తున్నారు. అమిస్తాపూర్ శివారులో గల నల్లగుట్ట తండాలోని సర్వే నంబరు 527లో గుట్ట ఉంది. అక్కడి నుంచి మట్టిని తోడి జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. 64 ఎకరాల్లో ఉన్న ఈ గుట్టను తవ్వగా, చదును అయిన రెండు ఎకరాల భూమిని కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఈ గుట్టకు ఎదురుగా సర్వే నంబరు 160లో ఎరుకల వారి గుట్ట ఉంది. 15 ఎకరాల్లో ఉన్న ఈ గుట్టను కూడా కొన్నేళ్లుగా ఖాళీ చేశారు. మండలంలోని హస్నాపూర్ శివారులో సర్వే నంబరు 56లో పోతుగుట్ట ఉంది. ఈ గుట్ట నుంచి కూడా ఏళ్ల తరబడి మట్టిని ఇష్టారాజ్యంగా తరలించారు. మండలంలోని తాటికొండ శివారులో సర్వే నంబరు 44లో ఉన్న కేశన్నగుట్ట నుంచి కూడా మట్టిని జిల్లా కేంద్రానికి తరలిస్తున్నారు. దాంతో 100 ఎకరాల్లో ఉన్న ఈ గుట్ట కరిగిపోతోంది. ఇదే ప్రాంతంలో ఉన్న ఈరన్నగుట్ట నుంచి కూడా మట్టిని తవ్వుతున్నారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో ఉన్న అల్లీపూర్ గ్రామం వద్ద గల ఎల్లమ్మ గుట్ట నుంచి రాయి, మట్టిని నిత్యం తరలిస్తున్నారు. మండలంలోని అన్నసాగర్ ప్రాంతంలో సర్వే నంబరు 216లో గల ఎల్లమ్మ గుట్ట(26 ఎకరాలు) నుంచి, హస్నాపూర్ శివారులోని పొట్టి గుట్ట నుంచి కూడా వందలాది టన్నుల మట్టిని తలిస్తున్నారు.



ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో మట్టిని పోస్తున్న లారీ

### నాశనమవుతున్న పచ్చని చెట్లు

గుట్టల నుంచి మట్టిని తోడటంతో వాటిపై ఉన్న పచ్చని చెట్లు నాశనం అవుతున్నాయి. వానాకాలం హరితహారం పథకం కింద గత ప్రభుత్వం ఎంతో ఖర్చు చేసి నాటిన చెట్లు మాఫియా చేతుల్లో నేలవాలుతున్నాయి. ఈ విషయంలో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి.

### మా దృష్టికి రాలేదు

గుట్టలను తోడి భూములను ఆక్రమించుకుంటున్న విషయం మా దృష్టికి రాలేదు. గుట్టల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయి. మట్టిని, ఇసుకను అక్రమంగా తరలిస్తే మైనింగ్ శాఖ అధికారులు నిఘా పెట్టి, కేసులు నమోదు చేయాలి. మాకు అధికారులు, సిబ్బంది సరిపోను లేరు. అయినా సరే మాదృష్టికి వస్తే దాడులు చేసి, అక్రమంగా మట్టిని, ఇసుకను తరలించే వాహనాలను సీజ్ చేస్తాం.

- పులిరాజు, భూత్పూర్ తహసీల్దార్

## ఎమ్మెల్సీ నామినేషన్లకు రేపు ఆఖరి రోజు



బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి బీ ఫాం అందజేస్తున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్

- చివరి రోజు నామినేషన్లు వేయనున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు
- కేసీఆర్ నుంచి 'బీ' ఫాం అందుకున్న నవీన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, మార్చి 9: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు సోమవారంతో నామినేషన్ల గడువు ముగియనుంది. ఈనెల నాల్గో తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఇప్పటి వరకు ఒక్క నామినేషన్ మాత్రమే దాఖలైంది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినపల్లి ఎంపీటీసీ మంగి విజయ్ ఒక్కరే నామినేషన్ వేయగా.. చివరి రోజు సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన మన్నె జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నారు. మన్నె జీవన్‌రెడ్డి ప్రచారంలో బిజీగా ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి నవీన్‌కుమార్‌రెడ్డికి మాజీ సీఎం కేసీఆర్ శనివారం బీ ఫాం అందజేశారు. వీరిద్దరు తమ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సోమవారం నామినేషన్లు సమర్పించనున్నారు.



## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

దామరగిద్ద, మార్చి 9: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం ముస్తాపేట్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సింగారం రఘుగౌడ్(35) నిర్మిస్తున్న ఇంటికి ఉదయం పైపుతో నీళ్లు పడుతున్నాడు. ఆ సమయంలో ఇంటి మీద కేబుల్ వైర్ అడ్డు వస్తోందని.. దానిని తీసి వేసేందుకు వైర్‌ను పట్టుకోగా విద్యుత్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. భార్య అరుణ, ఇంటిపక్కల వారు నారాయణపేట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రఘు తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. రఘు ఆటో నడుపుతూ తల్లి, భార్యాపిల్లలను పోషిస్తున్నాడు. ఇతనికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## లారీ, బస్సు ఢీకొని ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన లారీ



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన బస్సు

భూత్పూర్, మార్చి 9: ప్రైవేటు బస్సు, లారీ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని పోతుల మడుగు శివారులో 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. విజయవాడకు చెందిన టోచన్ లారీ(రిపేరులో ఉన్న వాహనాలను తీసుకెళ్లే వాహనం) హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్‌కు వెళ్తోంది. భూత్పూర్ వద్ద యూటర్న్ కావాల్సి ఉండగా.. డ్రైవర్‌కు దారి తెలియక పోతులమడుగు స్టేజీ వరకు వచ్చాడు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్ వెళ్లేందుకు శేరిపల్లి గ్రామానికి వెళ్లే యూటర్న్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా వెనకాలే వేగంగా వస్తున్న ప్రైవేటు స్లీపర్ కోచ్ వోల్వో బస్సు ఢీకొట్టింది. ఈ ఘటనలో విజయవాడకు చెందిన టోచన్ లారీ డ్రైవర్ ఏసుబాబుకు తీవ్ర గాయాలు అయ్యాయి. తమిళనాడు రాష్ట్రం నాయకల్ జిల్లా రాసిపురం గ్రామానికి చెందిన ప్రైవేటు బస్సు డ్రైవర్ ధన్‌పాల్ కూడా గాయపడ్డాడు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి తమిళనాడు మీదుగా కేరళ రాష్ట్రంలోని ఎర్నాకులానికి వెళ్తోంది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం నుంచి వారంతా బయటపడ్డారు. ప్రమాద సమయంలో కర్నూల్ వైపు నుంచి ఏదైన వాహనం వచ్చి ఉంటే భారీ ప్రాణ నష్టం జరిగేది. క్షతగాత్రులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


సాతర్లలో సాగు చేసిన ఖర్జూర తోట


ఖర్జూర గెలను చూపుతున్న రైతు

# ఆహా ఖర్జూర

- తోట సాగుతో అధిక లాభాలు
- ఎకరాకు రూ.ఆరు లక్షల వరకు ఆదాయం
- జిల్లాలోనే మొదట పంట సాగు
- కీటకాల నుంచి పంటను కాపాడుకుంటే అధిక దిగుబడి

ఇటిక్యాల, మార్చి 9 : ఖర్జూర పండుకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. దీంతో జోగుళాంబ గద్వాల జిల్లాలోని ఇటిక్యాల మండలం సాతర్ల గ్రామంలో ఓ రైతు రెండెకరాల్లో ఖర్జూర పంట సాగు చేస్తున్నాడు. పంట సీజన్‌లో కొందరు వ్యాపారులు తోట వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నట్లు రైతు సాతర్ల భాస్కర్‌రెడ్డి తెలిపారు. పండ్ల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతు భాస్కర్‌రెడ్డి రాయలసీమలోని అనంతపురం జిల్లాలో పంట సాగు చేస్తున్న కొందరి రైతుల సలహాలను తీసుకున్నాడు. వారి సలహాలు, సూచనల మేరకు గత మూడేళ్ల క్రితం తమిళనాడు రాష్ట్రంలోని కొయంబత్తూరు నుంచి ఎల్లైట్, బరిహి, మిడ్జిల్ రకాల 135 ఖర్జూర మొక్కలు తీసుకవచ్చి రెండెకరాల్లో సాగు చేశాడు. ఒక్కో మొక్కకు రూ.ఐదు వేల ఖర్చు అయినట్లు అతను పేర్కొన్నాడు. నవంబర్, డిసెంబర్ నెలల్లో పూత వస్తుందని, మేల్, ఫీమేల్ పూతను క్రాస్ చేయడంతో మే నెలలో పంట వస్తుందన్నారు. సాగులో సేంద్రీయ ఎరువులు, జింక్, పొటాషియం, ఎరువులు సైతం వాడినట్లు చెప్పాడు. పంట సాగులో ప్రతీరోజు నీరు పెట్టాలని, 20 రోజులకు ఒకసారి చెట్టుకు కొమ్ముపురుగు ఆశించకుండా క్రిమి సంహారక మందు పిచికారి చేయాలన్నారు. కొమ్ముపురుగు చెట్టు సుడిలో ఉంటుందని దాంతో చెట్టు చనిపోతుందని నిత్యం చెట్టును పరిశీలిస్తు ఉండాలన్నారు. గతేడాది నుంచి పంట వస్తోందని, ఎల్లైట్, బరిహి పంట కేజీ రూ.150 నుంచి రూ.300 వరకు మార్కెట్‌లో అమ్ముకోవచ్చన్నాడు. మిడిల్ రకం పండు ఖరీదు ఎక్కువగా ఉంటుందని, కేజీ రూ.మూడు వేల వరకు ఉంటుందని తెలిపాడు. జాతీయ స్థాయిలో మార్కెట్ దొరికితే మంచి లాభాలు ఉంటాయని, ఎకరాకు రూ.ఆరు లక్షల నుంచి రూ.ఎనిమిది లక్షల వరకు లాభాలు వస్తాయన్నారు. ఇప్పటివరకు హైదరాబాద్, ముంబాయి, బెంగుళూరు, ఢిల్లీ పట్టణాలకు పంపామని, దుబాయి వంటి సుదూర ప్రాంతాలకు ఎగుమతి చేసినట్లయితే రైతులకు సిరుల పంట కురుస్తుందన్నారు.

**కీటకాల నుంచి కాయలను కాపాడుకోవాలి..**

**- భాస్కర్‌రెడ్డి, రైతు**

పూత అనంతరం కాయ వస్తున్నప్పటి నుంచి పలు జాగ్రతలు తీసుకోవాలి. ముఖ్యంగా ఎలుకలు, ఉడుతలు, పక్షుల నుంచి పంటను కాపాడుకోవాలి. పూతకు, కాయలకు సూర్యరశ్మి తాకే విధంగా నెట్‌లను ఉపయోగిస్తున్నా. ఉన్నత చదువులు చదువుకున్నా వ్యవసాయంతో ఉన్న మక్కువతో నిమ్మ, మునగ తోటలు సాగు చేశా. కొత్తగా ఖర్జూర తోటల సాగుతో మెరుగైన ఆదాయం పొందొచ్చు.

# పడిపోయిన పల్లీ ధరలు

- పెట్టిన పెట్టుబడి రాక అన్నదాతల గగ్గోలు
- వాతావరణ మార్పులు, తెగుళ్లు, చీడపీడల ప్రభావమేనంటున్న వ్యవసాయ శాఖ అధికారులు
- నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా లక్షా 4,307ఎకరాల్లో పంట సాగు
- నష్టాన్ని గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలంటున్న బాధితులు


తాడూరు మండలం సిర్సవాడ గ్రామం వద్ద వేరుశనగ పంటలో వేరుశనగను తీస్తున్న రైతు కూలీలు

తాడూరు, మార్చి 9 : జిల్లాలో ఈ ఏడాది వేరుశనగ ఆశించినంత మేర దిగుబడి లేకపోవడం మూలంగా సాగు చేసిన అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఆందోళన చెందుతున్నారు. గత సంవత్సరం దిగుబడిపరంగా, మార్కెట్ ధర పరంగా మంచి ఆదాయం రావడంతో ఈ ఏడాది సైతం అదేవిధంగా ఉంటుందనుకుని రైతులు ఆశ పడినప్పటికీ వారి ఆశలపై దిగుబడి, ధర రూపేణా నీళ్ల చల్లడంతో ఆశలన్నీ అడియాశలుగా మారాయి. వాతావరణ మార్పుల కారణంగా వేరుశనగ పంటకు చీడ పీడలు, తెగుళ్ల కారణంగా దిగుబడిపై ప్రభావం పడి అన్నదాతలను నష్టాల ఊబిలోకి నెట్టింది. ఈ ఏడాది ప్రారంభ సమయం డిసెంబరు ఆఖరివారం, జనవరి నెలలో పంట చేతికొచ్చిన రైతులు కొంతమేర బయట పడినప్పటికీ జనవరి చివరి వారం నుంచి పంట చేతికొచ్చిన వేరుశనగ రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారింది.

### జిల్లాలో వేరుశనగ సాగు ఇలా..

నాగర్‌కర్నూల్ జిల్లాలో ఉన్న 20 మండలాల పరిధిలో గత సంవత్సరం ఒక లక్షా 17వేల 813 ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేయగా ఈ ఏడాది ఒక లక్షా 4,307 ఎకరాల్లో రైతులు వేరుశనగ పంటను సాగు చేశారు. గత సంవత్సరంతో పోల్చినట్లయితే ఈ సంవత్సరం సాగు కొంత మేర తగ్గినప్పటికీ సాగు చేసిన రైతులు మాత్రం నష్టాల ఊబిలోకి వెళ్లారు. వేరుశనగ పంటకు సంబంధించి వాతావరణ మార్పుల కారణంగా చీడపీడలు అధికంగా ప్రభావం చూపి ఎండుతెగుళ్లతో పంట దిగుబడిపై పెద్ద ఎత్తున ప్రభావం పడినట్లు వ్యవసాయ శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఏదేమైనా రైతులు సాగు చేసిన పంటకు అనుకున్న మేర దిగుబడి రానట్లయితే అది వారి జీవన శైలిపై ప్రభావం పడుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

### పెట్టుబడులు

రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటకు సంబంధించి పెట్టుబడి వ్యయం ఈ ఏడాది గణనీయంగా పెరిగింది. రైతులు వేరుశనగ విత్తనాలు విత్తుతుకునే క్రమంలో ఒక్కో ఎకరాకు పది వేల రూపాయల మేర విత్తనాల ఖర్చు కాగా.. ఎరువులు, మందులతో పాటు రైతు కూలీల ఖర్చులు భారీగా పెరగడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం వేరుశనగ పంట సాగు చేస్తున్న రైతులకు సొంత భూమి ఉంటే ఒక్కో ఎకరాకు 30 నుంచి 40వేల రూపాయల పెట్టుబడి కాగా.. కౌలు భూమి చేసే రైతులకు ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు అవుతుంది. ప్రస్తుతం ఈ ఏడాది వేరుశనగ దిగుబడి ఎకరాకు నాలుగు నుంచి ఏడు క్వింటాళ్ల మధ్యలోనే వస్తోంది. దీంతో పెట్టిన పెట్టుబడి రాక రైతులు తీవ్ర మానసిక ఆందోళన చెందుతున్నారు.

### మార్కెట్

రైతులు పండించిన వేరుశనగ పంటకు గత సంవత్సరం అత్యధికంగా రూ.ఏడు వేల నుంచి రూ.8500 వరకు ధర పలకగా ప్రస్తుతం ఈ సంవత్సరం ఒక్కో క్వింటాల్‌కు రూ.నాలుగు వేల నుంచి రూ.ఆరు వేల వరకు ధర పలుకుతుందని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పంట చూసుకున్నట్లయితే దిగుబడిలో అత్యధిక నష్టం.. ధర పరంగా చూసుకున్నా అతి తక్కువ ధర పలుకుతుండడంతో వేరుశనగ పంట సాగు చేసిన రైతులు పెట్టిన పెట్టుబడి రాక ఆందోళన చెందడంతో పాటు అప్పుల ఊబిలోకి నెట్టుకుపోతున్నారు. ప్రభుత్వం వేరుశనగ పంట వేసి నష్టపోయిన వారిని గుర్తించి ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

### అప్పులు తప్ప మిగిలిందేమీ లేదు..



ఈ ఏడాది బుడ్డలు సాగు చేసిన మా పరిస్థితి ఎటూ చెప్పుకోలేని విధంగా ఉంది. పెట్టిన పెట్టుబడి రాక అప్పులపాలయ్యే పరిస్థితి నెలకొంది. నాలుగెకరాల్లో వేరుశనగ సాగు చేసినప్పటికీ ఆశించినంత మేర పంట వచ్చేటట్టు కనబడడం లేదు. ప్రభుత్వం ఆదుకుంటే బాగుంటుంది.

**- లక్ష్మమ్మ, సిర్సవాడ, రైతు**

### పోయిన సంవత్సరం బాగా ఉండింది.



ఈ ఏడాదితో పోల్చితే గత సంవత్సరమే వేరుశనగ పంటకు మంచి దిగుబడి ఉన్నది. ధర పరంగా మంచి లాభాలు వచ్చాయి. ఈ ఏడాది 11 ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తే మొత్తం ఖర్చులన్నీ పోను దాదాపు రూ.లక్షా 50 వేలు నష్టపోయా. ప్రభుత్వం నష్ట పరిహారం ఇచ్చి వేరుశనగ రైతులను ఆదుకోవాలి.

**- మల్లయ్య, పాపగల్ గ్రామ రైతు**

# అలంపూర్‌లో కనుల పండువగా రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

అలంపూర్, మార్చి 9 : ఐదవ శక్తిపీఠం అలంపూర్ ఆలయంలో శనివారం రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను రథంలోకి చేర్చి బ్రాహ్మణవీధి నుంచి అక్బర్‌పేట వరకు ఊరేగింపు నిర్వహించారు. అక్కడ బలిహరణ, పోలి తేరుపై చల్లి ప్రత్యేక పూజలు నిర్వహించి, హారతులు ఇచ్చారు. తిరిగి అక్బర్‌పేట నుంచి ఆలయం వరకు ఉత్సవమూర్తులను తీసుకెళ్లారు. కార్యక్రమాన్ని తిలకించడానికి పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య, మునిసిపల్ చైర్‌పర్సన్ మనోరమ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు. అలంపూర్, ఉండవల్లి ఎస్సైలు నాగరాజు, శ్రీనివాసులునాయక్, బందోబస్తు నిర్వహించారు.

# వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

- రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య సంరక్షణ అధికారి రాకేష్‌మోహన్ దోబ్రియాల్


వాచ్‌టవర్‌ను ప్రారంభించిన రాకేష్‌మోహన్ దోబ్రియాల్

లింగాల, మార్చి 9 : అటవీ సంరక్షణతో పాటు, వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర అటవీశాఖ ముఖ్య సంరక్షణ అధికారి రాకేష్ మోహన్ దోబ్రియాల్ అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం పద్మన్నపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన ఫారెస్ట్ వాచ్‌టవర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అడవులు మానవ మనుగడకు ఎంతో అవసరమన్నారు. అటవీ జంతువులకు హాని కల్గించొద్దని, జంతువులను చంపితే వారిపై కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ క్షితిజ, అచ్చంపేట ఎఫ్‌డీవో తిరుమల్‌రావు, శ్రీనివాస్, లింగాల ఎఫ్ఆర్‌వో వీరేశం, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆయన పదర మండలంలో గడ్డిక్షేత్రాలను పరిశీలించారు.

# పిల్లల అపహరణ బూటకం : సీఐ కనకయ్య

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 9 : నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని ఉయ్యాలవాడ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చిన్నపిల్లలను అపహరించుకుని వెళ్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అయిన సంఘటన బూటకమని సీఐ కనకయ్య, ఎస్సై గోవర్ధన్ తెలిపారు. శనివారం వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ గౌస్ ఇంటి అద్దె కోసం ఉయ్యాలవాడలో పరిచయమున్న ఒక మహిళతో గ్రామానికి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటున్న ఇద్దరు పిల్లల్లో ఒకరికి సంబంధించిన ఇల్లు చూపించమని కోరారు. దీంతో ఆ పిల్లలు ఆటోలో కూర్చొని వెళ్తుండగా ఒక పిల్లవాడి తండ్రి వారిని చూడడంతో ఆ పిల్లలు ఆటో దిగి పారిపోయారు. తండ్రి భయానికి ఆ పిల్లలు తమను ఆటో డ్రైవర్ బలవంతంగా ఎక్కించుకుని పోతున్నాడని తెలిపారు. ఈ ఘటనపై సీసీ ఫుటేజీలను పరిశీలించి, పూర్తి స్థాయి విచారణ జరిపిన తర్వాత వాస్తవం తెలిసిందని సీఐ, ఎస్సైలు వివరించారు. ఈ సంఘటనపై అపోహాలకు గురి కావొద్దని, చిన్నపిల్లలను ఎక్కడా కూడా ఎత్తుకెళ్లడం లేదని, పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని అన్నారు. ఎవరికైనా సందేహాలుంటే, ఎక్కడైనా ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నట్లయితే డయల్ 100కు కాల్ చేయాలని తెలిపారు.

# బైకు, బస్సు ఢీ, ముగ్గురికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 9 : బైకు, బస్సు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని పెద్దముద్దునూరు గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది. ఎస్సై గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రానికి చెందిన వెంకటేష్, శివ, తిరుపతిలు పెద్దకొత్తపల్లి నుంచి నాగర్‌కర్నూల్‌కు బైక్‌పై వెళ్తుండగా నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు పెద్దముద్దునూరు గ్రామ శివారులో ఢీకొట్టింది. ప్రమాదంలో బైక్‌పైనున్న ముగ్గురికీ తీవ్ర గాయాలు కావడంతో 108లో నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఇరువురి మధ్య ఘర్షణ, కేసు నమోదు

ఉండవల్లి, మార్చి 9 : జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండల కేంద్రంలో ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండవల్లి హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చిన్న రాముడు, వరసకు బంధువైన చిన్న ఆముదాలపాడు గ్రామానికి చెందిన గొల్ల రామకృష్ణ ఇద్దరూ కలిసి స్థానిక మద్యం దుకాణంలో మద్యం కొనుగోలు చేయడానికి వెళ్లారు. ఆ సమయంలో మండల కేంద్రానికి చెందిన కురువ స్వాములు మద్యం తాగుతూ వీరిని చూసి కులం పేరుతో దూషించాడు. అంతేకాకుండా వీరి వద్ద అప్పు తీసుకొని తిరిగి చెల్లించకపోయినా ఏమీ చేసుకోలేరని పరుష పదజాలంతో వారినుద్దేశించి అన్నాడు. దీంతో రామకృష్ణ, రాముడు మమ్మల్ని దూషిస్తావా అంటూ స్వాములును నిలదీశారు. మాటామాటా పెరగడంతో ఆ పక్కనే మద్యం తాగుతున్న ఓ వ్యక్తి వద్దనున్న స్టీల్ ఊతకర్ర తీసుకొని గొల్ల రామకృష్ణ తలపై స్వాములు బాదాడు. అడ్డువచ్చిన చిన్న రాముడుపై కూడా దాడి చేయడంతో చేతికి గాయమైంది. గాయపడిన రామకృష్ణ, రాముడును ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిన్న రాముడు ఫిర్యాదు మేరకు కురువ స్వాములుపై కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మానవపాడు, మార్చి 9 : జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం కొర్విపాడు గ్రామంలో పురుగుల మందు తాగిన మల్లన్న(47) చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై చంద్రకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మల్లన్న కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన మల్లన్న ఈనెల ఏడో తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మల్లన్న మృతి చెందాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# మహిళ అదృశ్యం

నవాబ్‌పేట, మార్చి 9 : మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం కొత్తపల్లి గ్రామంలో మతిస్థిమితం లేని ఓ మహిళ అదృశ్యమైంది. ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం కొత్తపల్లికి చెందిన అలివేలమ్మను పగిడ్యాల గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తికి ఇచ్చి 15 సంవత్సరాల క్రితం వివాహం చేశారు. ఏడాది తర్వాత అలివేలమ్మకు మతిస్థిమితం లేకుండా తిరుగుతుండటంతో తల్లిగారి సొంత గ్రామమైన కొత్తపల్లికి తీసుకువచ్చారు. ఫిబ్రవరి 15 నుంచి ఆమె కన్పించకపోవడంతో ఆందోళన చెందిన బంధువులు ఆచూకీ కోసం వెతికారు. జాడ కానరాకపోవడంతో శనివారం తమకిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభిషేక్‌రెడ్డి తెలిపారు.

# అదుపు తప్పి చెట్టును ఢీకొన్న కారు

- తప్పిన ప్రాణాపాయం

పాన్‌గల్, మార్చి 9 : వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం అన్నారం తండా సమీపంలోని మలుపు వద్ద శనివారం కారు అదుపు తప్పి చెట్టును ఢీకొంది. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నుంచి వనపర్తికి వెళ్తుండగా తండా సమీపంలో మలుపు వద్ద కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. డ్రైవర్ సమయస్ఫూర్తిగా వ్యవహరించడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు సురక్షితంగా బయటపడ్డారు. దీంతో ప్రాణాపాయం తప్పినట్లు గ్రామస్థులు తెలిపారు.

## భౌరాపూర్‌లో ముగిసిన
# చెంచుల పండుగ

లింగాల, మార్చి 9 : నల్లమల అటవీ ప్రాంతంలోని అప్పాపూర్ చెంచుపెంట గ్రామ పంచాయతీ పరిధిలో గల భౌరాపురంలో చెంచుల జాతర పండుగ శనివారం విజయవంతంగా ముగిసింది. శ్రీశైలం దేవస్థానం కంటే 300 ఏండ్లకు ముందుగా గ్రామంలోని చెరువు వద్ద అమ్మవారు వెలిశారు. ఇక్కడి భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం ప్రతీ యేటా చెంచుల జాతర పండుగను నిర్వహిస్తోంది. ఆదివాసీలు తమ నియమ నిబంధనలు, ఆచార వ్యవహారాలు, పద్ధతులను తర్వాతి తరాలకు అందించాలనే ఉద్దేశంతో అనాదిగా శివరాత్రి పండుగను పురస్కరించుకొని భౌరాపురం భ్రమరాంబిక మల్లికార్జునస్వామిని కొలుస్తూ జాతర నిర్వహించుకుంటున్నారు. ఈనెల ఏడో తేదీన ప్రారంభమైన ఈ ఉత్సవాలకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి చెంచు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావడంతో చెంచుపెంటల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఆయా జిల్లాల నుంచి వచ్చే చెంచు గిరిజనులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. చెంచులకు, చెంచు గిరిజనేతర భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా కలెక్టర్ ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకున్నారు. రాత్రివేళల్లో చెంచుల సంస్కృతీ సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. శివరాత్రి రోజున నిర్వహించిన భ్రమరాంబిక మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, అనురాధ దంపతులు భ్రమరాంబిక తరుపున, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, అశ్లేష దంపతులు మల్లికార్జునస్వామి తరుపున పెద్దలుగా వ్యవహరించి ఎదుర్కోళ్ల కార్యక్రమంలో పాల్గొన్నారు. చెంచు పెద్దల సాంప్రదాయ పద్ధతిలో కల్యాణం వైభవంగా జరిగింది.

చెంచు గిరిజనులు శనివారం వడిబియ్యం వంటలతో సహపంక్తి భోజనం చేశారు. మైసమ్మకు శాంతి పూజలతో ఉత్సవాలు ముగిశాయి.


భౌరాపూర్‌లోని మైసమ్మ విగ్రహం

# ఇసుక వాహనాల అడ్డగింత

- సెలవు దినాల్లో ఇసుకను తరలించడంపై గ్రామస్థుల ఆగ్రహం
- రైతులతో కలిసి టిప్పర్లను అడ్డుకున్న బీజేపీ నాయకులు



ఇసుక తరలింపు ప్రదేశం వద్ద అధికారులతో మాట్లాడుతున్న రైతులు, బీజేపీ నాయకులు

మిడ్జిల్, మార్చి 9 : తమ గ్రామం నుంచి ఇసుకను తరలించొద్దని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడంలేదని, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం ఉన్నప్పటికి ఇసుకను తరలిస్తున్నారని ఆగ్రహించిన అయ్యవారిపల్లి గ్రామ రైతులు, బీజేపీ నాయకులు శనివారం ఇసుక టిప్పర్లను అడ్డుకున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 386, 387, 389లలో డంపు చేసి ఉన్న ఇసుకను జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించేందుకు అనుమతులు పొంది ఇసుకను ప్రైవేటు కట్టడాలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపించారు. కాగా తమ గ్రామం నుంచి ఇసుకను తరలించవద్దని మొదటి నుంచి రైతులు అడ్డుకుంటున్నప్పటికి తమకు అనుమతులు ఉన్నాయంటూ ఇసుకాసురులు యధేచ్ఛగా ఇసుకను టిప్పర్లలో తరలిస్తున్నారు. ఇసుక తరలింపు ప్రదేశం వద్ద మైనింగ్, టీఎస్ఎండీసీ అధికారులు వే బిల్లులను ఇవ్వకుండా ప్రైవేటు వ్యక్తులతో వేబిల్లులను ఇప్పిస్తుండగా అడ్డుకున్నారు. ఈ విషయంపై స్థానిక పోలీసులను ఫోన్ చేసినా స్పందించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ రాజునాయక్ ఇసుక తరలింపు ప్రదేశానికి ఆర్ఐ అంబిక, జూనియర్ అసిస్టెంట్ కృష్ణయ్యను పంపించారు. ఇసుక తరలింపు ప్రదేశం వద్ద పరిస్థితిని సమీక్షించి వేబిల్లులు ఇస్తున్న వ్యక్తిని ప్రశ్నించారు. తమకు మైనింగ్ ఏడీ వేబిల్లులు ఇవ్వమన్నట్లు గౌస్ అనే వ్యక్తి సమాధానమిచ్చారు. దీంతో ఆగ్రహించిన రైతులు టిప్పర్లను, గౌస్ అనే వ్యక్తిని స్టేషన్‌కు తీసుకవెళ్లి కేసులు నమోదు చేయించాలని పట్టుబట్టారు. ఇసుక లోడ్‌తో ఉన్న టిప్పర్లను డంప్ వద్ద ఖాళీ చేయించిన అధికారులు వాహనాలను అక్కడ్నుంచి పంపించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లె తిరుపతి, రైతు సంఘం నాయకుడు నర్సింహ్మారెడ్డి, రైతులు తిరుపతిరెడ్డి, మల్లేష్, వెంకట్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, లక్ష్మయ్య, శేఖర్, సురేష్‌రెడ్డి, బాల్‌లింగం, గోపాల్, సురేష్, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రెడ్డి, వెంకట్రాములు, ఉమేష్, శ్రీనివాసులు, జంగయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, రాములు, రాంచంద్రయ్య ఉన్నారు.

### గ్రామంలో మాట్లాడిన తర్వాతే..

గ్రామానికి ఏం ఇస్తారో మాట్లాడిన తర్వాతే ఇసుకను తరలించమని చెప్పినా విన్పించుకోకుండా, గ్రామస్థుల మాట లెక్క చేయకుండా ఇసుకను తరలిస్తారా అని కొంతమంది ఇసుకాసురులను ప్రశ్నించారు. గ్రామ అభివృద్ధి కోసం డబ్బులు ఇచ్చిన తర్వాతనే ఇసుకను తరలించాలని, లేకపోతే నిత్యం వాహనాలను అడ్డుకుంటామని గ్రామస్థులు హెచ్చరించారు.




# ఫార్మాసిస్టుల దారెటు..?

- ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో 20 మందికి నోటిఫికేషన్ లేకుండా నియామకం
- ఈ నెలాఖరు వరకే కొలువు పునరుద్ధరణ గడువు
- ఎవరిని ఉంచుతారో, ఎవరిని తొలగిస్తారోనని ఆందోళన

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), మార్చి 9 : జనరల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న 26 మంది ఫార్మాసిస్టులు అయోమయంలో పడ్డారు.

ఆసుపత్రిలో మొత్తం 32 ఫార్మాసిస్టు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అప్పటి జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ 2017 జనవరిలో నోటిఫికేషన్ వేసి ఎనిమిది మందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిన నియామకం చేశారు. ఆ తర్వాత జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి సిఫారసుతో ఎలాంటి నోటిఫికేషన్ లేకుండా కోవిడ్ సమయంలో 20 మంది నియామకాలు చేపట్టారు. వీరిలో అప్పటి అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు, లీడర్లు, ప్రజాప్రతినిధి అనుచరులు ఉన్నారు. ఇక అప్పటి కలెక్టర్ నోటిఫికేషన్ వేసి తీసుకున్న ఎనిమిది మంది అవుట్ సోర్సింగ్ సిబ్బందిలో ప్రస్తుతం ఇద్దరికి రెగ్యులర్ ఉద్యోగాలు రావడంతో మిగతా ఆరుగురు మాత్రమే మిగిలిపోయారు. అందులో ఒకరు అయిష్టంగానే పనిచేస్తున్నారు. మొత్తం ఆరుగురు మాత్రం ఫార్మసీలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న 26 మంది ఫార్మాసిస్టుల ఉద్యోగాల పునరుద్ధరణ గడువు ఈ నెలాఖరుతో ముగియనుంది. మార్చి 31 నాటికి వారి గడువు అయిపోతుండడంతో వారిని ఉంచుతారా..? లేక తొలగిస్తారా..? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

చాలాకాలం తర్వాత 2023 సెప్టెంబర్ నెలలో రెగ్యులర్ నియామకాలు జరిపిన ప్రభుత్వం 28 మందిని జనరల్ ఆసుపత్రికి కేటాయించారు. వీరంతా రెగ్యులర్ కావడంతో అవుట్‌సోర్సింగ్ వారిని తొలగించాల్సి ఉంది. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న వారిలో నోటిఫికేషన్ లేకుండా తీసుకున్న వారిని తొలగిస్తారా..? లేక నోటిఫికేషన్ ద్వారా తీసుకున్న వారిని రెన్యువల్ చేస్తారా.. అనే దానిపై స్పష్టత లేదు. మొత్తంగా ఫార్మాసిస్టుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.

### మూడు నెలలుగా అందని వేతనాలు

ఆసుపత్రిలో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఫార్మాసిస్టులకు గత మూడు నెలలుగా వేతనాలు రావడంలేదు. 2023 డిసెంబరు నుంచి 2024 ఫిబ్రవరి వరకు వేతనాలు రావల్సి ఉంది. కానీ బడ్జెట్ లేదని, ఏప్రిల్ నెలలో రావొచ్చనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు. అయితే వేతనాలు రాకపోవడంతో ఫార్మాసిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేవలం నెల జీతంపై ఆధారపడి బతికే వాళ్లు అప్పులు చేసి పూట గడుపుకుంటున్న దుస్థితి నెలకొంది.

### ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు..

ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న ఫార్మాసిస్టుల రెన్యువల్‌పై మాకు ఎలాంటి ఆదేశాలు రాలేదు. వారిని కొనసాగించాలా..?, వద్దా అనే అంశంపై ఎలాంటి ఉత్తర్వులు కూడా రాలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలను తప్పకుండా పాటిస్తాం. అయితే వారి వేతనాలపై కూడా కాంట్రాక్టరుతో మాట్లాడి ఈ నెలలో అన్నీ కలిపి ఇప్పించేలా చర్యలు తీసుకుంటాను.

**- డాక్టర్ జీవన్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్**

## శ్రీశైలంలో వైద్య శిబిరం



శ్రీశైలంలో భక్తులకు వైద్యం చేస్తున్న గ్రామీణ వైద్యుడు శ్రీనివాసులు

చారకొండ, మార్చి 9: మండల కేంద్రానికి చెందిన గ్రామీణ వైద్యుడు చిలివేరు శ్రీనివాసులు తన తల్లిదండ్రులు చిలివేరు మల్లప్ప, మల్లమ్మ గార్ల జ్ఞాపకార్థం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వచ్చే భక్తులకు శనివారం శ్రీశైలంలోని పద్మశాలి సత్రం వద్ద ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం 15 ఏళ్ల నుంచి మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు శ్రీశైలం వచ్చే భక్తులకు వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ చిలివేరు సత్యం, సంస్థ అధ్యక్షుడు వర్కాల సూర్యనారాయణ, కార్యనిర్వాహక అధ్యక్షుడు కర్నాటి శ్రీధర్, ఉపాధ్యక్షుడు గోశిక యాదగిరి, ప్రధాన కార్యదర్శులు జేరపు చంద్రశేఖర్, పున్న శ్రీనివాసులు, కోశాధికారి రావిరాల చిన్న వీరయ్య, పున్న యాదయ్య, పద్మశాలి సత్ర సిబ్బంది ఏల్పుల కృష్ణ, గోవిందరాజు, గిరిదర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన యూనివర్సిటీ ఓఎస్‌డీగా వంశీకృష్ణారెడ్డి నియామకంపై హర్షం

తెలకపల్లి, మార్చి 9 : మండల పరిధిలోని చిన్నముద్దునూర్ గ్రామానికి చెందిన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ వంశీకృష్ణారెడ్డిని ఆదిలాబాద్ జిల్లా సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ గిరిజనుల ఆరాధ్య దైవం సమ్మక్క సారక్క ఓఎస్‌డీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించడంపై సీఎల్ఆర్ విద్యా సంస్థ అధ్యక్షుడు శ్యాంసుందర్‌రెడ్డి, కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వి.రాజమహేందర్‌రెడ్డిలు శనివారం హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓఎస్‌డీ వంశీకృష్ణారెడ్డి సీఎల్ఆర్ విద్యా సంస్థలో పూర్వ విద్యార్థి అని వారు మరిన్ని పదవులు అధిష్ఠించాలని ఈ సందర్భంగా వారు కోరారు. బాధ్యతలు చేపట్టిన వంశీకృష్ణారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## డాక్టర్ మల్లురవికి ఎంపీ టికెట్ ఇవ్వాలని దీపాదాస్ మున్షీకి వినతి



కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు

నాగర్‌కర్నూల్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీతోనే సమాజానికి మేలు జరుగుతుందని నమ్మిన వ్యక్తి డాక్టర్ మల్లురవికే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ టికెట్ కేటాయించాలని పలువురు నాయకులు శనివారం తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి వినతి పత్రం అందజేశారు. టీపీసీసీ మెంబరు కొలన్ వల్లభ రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు ఎండీ.హబీబ్‌రెహమాన్, రాష్ట్ర దళిత ఉద్యమాల నాయకులు వంకేశ్వరం నిరంజన్, కల్వకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితీ విజయ్‌కుమార్‌రెడ్డిలు ఈ సందర్భంగా వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు. కష్టకాలంలో పార్టీకి ఎల్లవేళలా తోడ్పాటునందించి ఎంపీగా, ఎమ్మెల్యేగా పని చేసిన అనుభవం, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో ఐదు నియోజకవర్గాల్లో గెలిపించేందుకు కృషి చేసిన డాక్టర్ మల్లురవికే పార్లమెంట్ టికెట్ ఇవ్వాలని వారు ఆ వినతిలో కోరారు.

● కొల్లాపూర్ : కాంగ్రెస్ పార్టీ కోసం అహర్నిషలు కృషి చేస్తూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ మల్లురవికే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేలకు మాలల చైతన్య సమితి నాయకులు పేర్కొన్నారు. కొల్లాపూర్ పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాలల చైతన్య సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిజ్జ దేవదాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మద్దెల రాందాసులు మాట్లాడారు. మల్లురవిని ఎంపీగా గెలిపించుకుంటామని వారన్నారు. మాలల చైతన్య సమితి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు సురేందర్, పట్టణ అధ్యక్షుడు బాపనపల్లి సందీప్, తాలుకా నాయకులు మద్దెల వెంకటరాములు, కే.కుర్మయ్య, ఎస్టీ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## యాగాల నిర్వహణతో మానవాళికి మేలు



బ్రాహ్మణులను సన్మానిస్తున్న రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు

కల్వకుర్తి, మార్చి 9 : యాగాల నిర్వహణతో మానవాళికి మేలు చేకూరుతుందని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు జూలూరి రమేష్‌బాబు అన్నారు. కల్వకుర్తి పట్టణంలో ఓ ఫంక్షన్ హాల్‌లో మహాలక్ష్మీ యాగం అత్యంత భక్తిశ్రద్ధలతో రెండవ రోజు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణులను పూలమాల, శాలువాలతో సత్కరించారు. ఆదివారం 108 గుం డాల్లో నాలుగు గంటల పాటు హోమాలు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. నాగరాజు, ప్రకాశ్, శ్రీనివాస్, ప్రసాద్, ప్రవీణ్, కృష్ణయ్య, వీరేశం, అశోక్, రాఘ వేందర్, రవి, రామ్మోహన్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

## నరసింహుడికి ప్రత్యేక పూజలు



నరసింహస్వామి సన్నిధిలో హారతి తీసుకుంటున్న ఆలయ ధర్మకర్త చిలుక సురేందర్‌రెడ్డి

తిమ్మాజిపేట, మార్చి 9: తిమ్మాజిపేట మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు నరసింహస్వామిని దర్శించుకుని అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అదేవిధంగా స్వామి వారికి ఇరువైపులా కొలువుదీరిన మహాలక్ష్మి అండాలమ్మ, దేవతామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. పురోహితులు గంగాధర శర్మశ్రీ లక్ష్మీనరసింహస్వామి అష్టోత్తర శతనామావళి పఠించి భక్తుల గోత్రనామాలను చదివి ఆశీర్వదించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకు ముందు ఆలయ ధర్మకర్త చిలుక సురేందర్‌రెడ్డి శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకుని పూజలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయా గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లి బోనాలు

వంగూరు, మార్చి 9: మండల పరిధిలోని రంగాపూర్‌లో వెలసిన గంగమ్మ తల్లి గంగపుత్రుల ఆరాధ్యదైవంగా ప్రసిద్ధి చెందింది. మహాశివరాత్రి పండగ సందర్భంగా ప్రతీ సంవత్సరం మార్చిలో గంగపుత్రులు పండగను మూడు రోజులు వైభవంగా నిర్వహిస్తారు. శనివారం ఆలయంలో కుంభాభిషేకం, బోనాలు ఘనంగా నిర్వహించారు. వైభవంగా సాగిన బోనాల ఊరేగింపు ఆధ్యాత్మిక శోభ వెల్లువిరిసింది.

భక్తులతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. ఊరేగింపులో డప్పులు మోగుతుండగా యువత ఆనందోత్సవాల మధ్య చిందులు వేస్తూపండగ సంతోషాన్ని పంచుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గంగపుత్రల సంఘం అధ్యక్షుడు నాగయ్య, భక్తులు పాల్గొన్నారు.

# పదికి పక్కాగా..

- ప్రభుత్వ బడుల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణ
- వంద శాతం ఉత్తీర్ణత సాధనకు కృషి
- ప్రతీ రోజు ప్రత్యేక పరీక్షలు

అచ్చంపేటటౌన్, మార్చి 9: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు సర్కారు బడుల్లో విద్యాశాఖాధికారులు పక్కాగా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. దీనికోసం నిత్యం మూడు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యవేక్షణలో ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి అవసరమైన మెటీరియల్ అందించడంతో పాటు వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి సబ్జెకుల వారీగా ప్రాక్టీస్ చేయిస్తూ వంద శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. జిల్లాలో మొత్తం 240 ప్రభుత్వ, గురుకుల, మోడల్ పాఠశాలలుండగా 8180 మంది విద్యార్థులున్నారు. ప్రైవేటు పాఠశాలలు 63ఉండగా 2346 పదవ తరగతి పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉన్నారు. అచ్చంపేట డివిజన్ 60 హైస్కూల్స్ 44 గురుకులాలు ఉండగా, 1668మంది విద్యార్థులున్నారు. 12ప్రైవేటు పాఠశాలలుండగా 492 విద్యార్థులున్నారు.

● **భవిష్యత్‌కు పునాది**

పాఠశాల విద్యార్థులకు పదో తరగతి తొలి మెట్టు. గతంలో పది పరీక్షలకు 11పేపర్లు ఉండగా గతేడాది నుంచి ప్రభుత్వం దానిని 6పేపర్లకు కుదించింది. దీంతో ఉపాధ్యాయులు పాఠ్యాంశ బోధనే కాకుండా వారికి ప్రేరణ కలిగే విషయాలను చెబుతూ ఉత్తేజ పరుస్తున్నారు. ఈ ఏడాది పదికి పది మార్కులు సాధించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. ఆత్మ విశ్వాసంతో పరీక్షలు రాసేలా ప్రతిరోజు స్లిప్‌టెస్ట్‌లు, వారంతపు పరీక్షలు నిర్వహిస్తున్నారు.

● **ప్రత్యేక తరగతులు ఇలా...**

పదో తరగతి పరీక్షలకు సమయం అసన్నమైంది. ప్రతి రోజు ఉదయం గంటన్నర పాటు ఒక సబ్జెక్టు వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహించి మధ్యాహ్నం 3గంటలకు ఆ సబ్జెక్టుపై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను పసిగడుతున్నారు. సాయంత్రం కొంత సమయం మరో సబ్జెక్టుపై ప్రీపేర్ చేయిస్తూ మరుసటి రోజు దానిపై పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థుల పరిస్థితులను తెలుసుకుంటూ దానికనుగుణంగా చదివిస్తున్నారు.



పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో గోవిందరాజులు (ఫైల్)

● **జిల్లాలో పదిలో మంచి ఫలితాలు సాధిస్తాం**



జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధతో చదివిస్తున్నాం. 100శాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థులు పరీక్షల భయం లేకుండా పాల్గొనాలి. ఈ నెల 18న ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలో విద్యార్థులకు అన్ని సిద్ధం చేశాం.

- జిల్లా విద్యాధికారి గోవిందరాజులు

● **పరీక్షలంటే భయం పోయేలా..**



పదో తరగతి విద్యార్థులకు పరీక్షలంటే భయం పోయేలా అవగాహన కల్పిస్తున్నాం. వారంతపు పరీక్షలు పెట్టడం వల్ల విద్యార్థులు ఒత్తిడి గురికాకుండా ఉండడానికి దోహదపడ్డాయి. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాం.

- బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం జీవన్ కుమర్

● **అర్థమయ్యేలా చెబుతున్నారు**



అన్ని సబ్జెక్ట్‌ల సార్లు మాకు అర్థమయ్యేలా ఒకటికి రెండుసార్లు చెబుతున్నారు. బోర్డులపై లెక్కలు చేయిస్తున్నారు. ఎప్పటికప్పుడు సాయంత్రం వేళల్లో హాస్టల్‌లో వార్డెన్ సారు మంచిగా చదివిస్తున్నారు. పదో తరగతి పరీక్షలో 10జీపీఏ సాధించేలా కష్టపడతాను.

- శివాని విద్యార్థిని, ఉన్నత పాఠశాల అచ్చంపేట

# ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తాం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, మార్చి 9: రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో పట్టణంలోని 100 పడకల ఆసుపత్రిలో త్వరలో అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పట్టణంలోని 9వ వార్డుకు చెందిన మైనార్టీ బాలిక అలియనాజ్‌కు అపెండెక్స్ ఆపరేషన్ చేశారు. ప్రజల సమస్యలు పరిష్కరిస్తూనే మరోపక్క వృత్తిలో భాగమైన వైద్యవృత్తిని కొనసాగిస్తూ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆపరేషన్‌లు చేస్తుండడంతో నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం ఆసుపత్రిలో రోగులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలకు అవసరమైన ఆసుపత్రిలో త్వరలో అన్ని వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని ఇక రెండు, మూడు నెలల్లో పూర్తిగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రతి రోగానికి వైద్యం అందిస్తామన్నారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలపై దృష్టి సారించామని, ప్రధానంగా వేసవి వస్తున్నందున తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక అధికారులు, మునిసిపల్ సిబ్బంది చూడాలన్నారు. కాలనీలలో ఉన్న సమస్యలు డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రధాన రహదారిలో ఉన్న రెండు డ్రైనేజీలకు రూ. 10 కోట్లతో లెటర్‌లు పంపించడం జరిగిందన్నారు. పట్టణంలోని పార్కుల ఏర్పాటుతో పట్టణ రూపురేఖలు మారుతాయన్నారు. మల్లకుంటను అతి త్వరలో నిర్మాణాలు పూర్తిచేసి పట్టణ ప్రజలు వాకింగ్ పాయింట్ కోసం అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రభు, వైద్యులు, సిబ్బంది కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో అపెండెక్స్ ఆపరేషన్ చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

# ఘనంగా లలితా సోమేశ్వరస్వామి కల్యాణం

కొల్లాపూర్, మార్చి 9 : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో లలిత సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఉదయం లలిత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయంలో కొనసాగిన కల్యాణోత్సవాన్ని భక్తులు వీక్షించారు. మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం తెల్లవారుజాము నుంచే లలితసోమేశ్వర ఆలయానికి భక్తుల తాకిడి విపరీతంగా ఉంది. శనివారం వివిధ ప్రాంతాలకు చెందిన దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారికి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు సమకూర్చారు. శనివారం సాయంత్రం సోమశిల గ్రామంలో లలితసోమేశ్వరస్వామి రథోత్సవాన్ని ఊరేగింపుగా నిర్వహించారు. రథోత్సవాన్ని తిలకించేందుకు కొల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. రథోత్సవంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.



సోమేశ్వరాలయంలో కల్యాణోత్సవం

### కల్యాణోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్

ఊర్కొండ: మండలంలోని రేవల్లి గ్రామంలో మహాశివరాత్రి పురస్కరించుకుని శనివారం తెల్లవారుజామున శివపార్వతుల కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కల్యాణ మహోత్సవంలో జడ్పీ చైర్ పర్సన్ శాంతకుమారి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పట్టువ స్త్రాలు సమర్పించి, రథోత్సవాన్ని ప్రారంభించారు. అదేవిధంగా మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యావ నిఖిల్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకులు ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక మాజీ సర్పంచ్ సునీత, నాయకులు అయూబ్ పాషా, సాంబశివుడు, రమేష్ రవీందర్, ఖలీల్ పాషా, పరుష రాం, గెలవలయ్య, హరిందర్ రెడ్డి, జగత్ రెడ్డి తదితరులు ఉన్నారు.



రేవల్లిలో శివపార్వతుల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న జడ్పీ చైర్‌పర్సన్ శాంతకుమారి



పెంట్లవెల్లిలో శివపార్వతుల రథాన్ని ముందుకు లాగుతున్న భక్తులు

● కోడేరు: మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని నర్సాయిపల్లి, ఎత్తం, రాజాపూర్ తదితర గ్రామాల్లో శివపార్వతుల కల్యాణం ఘనంగా నిర్వహించారు. శనివారం కోడేరులో ఉమామహేశ్వర వార్షికోత్సవాలు గత మూడు రోజులుగా నిర్వహించారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు హాజరై కల్యాణోత్సవం తిలకించారు. ఈ వార్షికోత్సవంలో రుద్రాభిషేకం, రుద్రహోమం, వీరభద్రుడి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామం పురవీధుల గుండా శివనామస్మరణతో వీరభద్రుడి సేవ, ఊరేగింపు, నంది కోళ్లసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● చారకొండ: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శివాలయం, దుర్గమాత దేవాలయంలో ఆలయ చైర్మన్ నారోజు పార్థసారథి ఆధ్వర్యంలో పార్వతీ పరమేశ్వరుల ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకొన్నారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ నారోజు పార్థసారథి మాట్లాడుతూ ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు రథోత్సవం, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రథోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు నారోజు రవిచారి, ఆంజనేయులుగౌడ్, మట్ట వెంకటయ్యగౌడ్, చింతపల్లి యాదయ్యగౌడ్, రామస్వామిగౌడ్, బాలచ్చిగౌడ్, గ్రామ పురోహితులు కృష్ణశర్మ, అనిల్‌శర్మ, వేణు శర్మ, ప్రశాంత్‌శర్మ, భజన బృందంసభ్యులు పాల్గొన్నారు.

### పరమశివునికి అభిషేకాలు

తిమ్మాజిపేట: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గత రెండు రోజులుగా తిమ్మాజిపేట మండల కేంద్రంలోని అతిపురాతన శివాలయంలో భక్తులచే పరమశివునికి శనివారం అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో శివాలయం చేరుకుని శివలింగాన్ని దర్శించుకుని ఉపవాస దీక్షలు విరమించారు. చత్రపతి శివాజీ సంఘం అధ్యక్షుడు చింతకాయల శివ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. గ్రామంలో పలువురు శివలింగానికి అభిషేకాలు నిర్వహించడమే కాకుండా ఆయా పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు.

● పెంట్లవెల్లి : మండల కేం ద్రంలో పురాతనమైన రామలింగేశ్వర ఆలయంలో వెలసిన శివపార్వతుల రథోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి రథోత్సవాన్ని ముందుకు లాగారు. అంతకు ముందు మాజీ ఎంపీటీసీ సభ్యుడు పల్లె నాగరాజు దంపతులు శివపార్వతుల విగ్రహాల ను ఆలయం నుంచి ఊరేగింపుగా రథోత్సవం దగ్గరికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథాన్ని ముందుకు లాగారు. కేరళ కళాకారుల డప్పు వాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శివపార్వతుల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా ఉంది. ఆలయ ట్రస్టు సభ్యులు సత్యం, నాయకులు కోట్ల సురేందర్, వీరయ్య, ఆర్.వెంకటస్వామి, రామకృష్ణ, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: మహా శివరాత్రి పురస్కరించుకొని శివపార్వతుల కల్యాణోత్సవం వేలాది భక్తుల శివనామ స్మరణతో కనుల పండుగా జరిగింది. బిజినేపల్లి మండలం పాలెంలోని అలువేలు మంగ సమేత వేంకటేశ్వర ఆలయ అనుబంధంగా ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి ఆదిదంపతుల కల్యాణోత్సవాని ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి, విజయరాణి దంపతులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకులు రామానుజచార్యుల ఆధ్వర్యంలో అర్చకబృదం వేద మంత్రోచ్చారణల మధ్య స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు.

అర్చకులు జయంత్ చక్రపాణి, ఈవో సీహెచ్ రంగారావు, ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, అభివృద్ధి కమిటీ సభ్యులు సురేందర్, బాలస్వామి, పెద్ద కురుమయ్య, వెంకటేశ్వర్లు, డాక్టర్ గోపాల్, జగన్ మోహన్, గోపాలస్వామి, మనుసాని వెంకటరమణ, శంకర్ లింగం, నితిన్, వేదాద్రి, ఆలయ సిబ్బంది శివకుమార్, బాబయ్య, బండారు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పాలెం శివాలయంలో శివపార్వతుల కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

## సీసీ రోడ్లకు భూమిపూజ



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న రాజేష్

అచ్చంపేట రూరల్, మార్చి 9 : మండల పరిధిలోని సిద్దాపూర్ గ్రామంలో శనివారం సీసీ రోడ్లకు జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు బిక్కుమాండ్ల రాజేష్ భూమి పూజ చేశారు. గ్రామంలో 70లక్షలతో 14సీసీ రోడ్లు మంజూరు చేసి గ్రామ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సిద్దాపూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్ము హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ మహేష్, సీనియర్ నాయకులు చిన్న నారయ్య, చెన్నారెడ్డి, బల్దూరి శీను, రాఘవులు, జాజాల రాజు, ఇమ్మడి భారతయ్య, బుచ్చిరాములు, కొమ్ము వెంకటయ్య, బండారి వెంకటయ్య, తిరుపతయ్య, ఆకిటి గోపాల్, ఎ.వెంకటేష్, సోషల్ మీడియా కో ఆర్డినేటర్‌గా హరీష్‌గౌడ్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగులకు పీఆర్సీ ప్రకటన పట్ల హర్షం

కల్వకుర్తి, మార్చి 9 : ఆర్టీసీ ఉద్యోగులకు ఫిట్‌మెంట్‌తో పాటు పీఆర్సీ 21శాతం ప్రభుత్వం ప్రకటించడం హర్షదాయకమని ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ ధారా సుందర్ అన్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన విధంగా ప్రభుత్వం పీఆర్సీ ఇవ్వడం పట్ల ఉద్యోగులు అభినందనలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం సీసీఎస్, పీఎఫ్ బకాయిల సమస్యలు పరిష్కరించాలని ధారా సుందర్ కోరారు. మహాలక్ష్మీపథకంతో ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణీకులకు మరింత సేవ చేసే అవకాశం లభించిందన్నారు.

## 'విశ్వకర్మ కౌసల్య స్కీంను సద్వినియోగం చేసుకోవాలి'

కల్వకుర్తి, మార్చి 9 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన విశ్వకర్మ కౌసల్య స్కీం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గంగాధర్ కోరారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రధాని కులవృత్తులను ప్రోత్సహించేందుకు రూ.లక్ష నుంచి 3లక్షల వరకు తక్కువ వడ్డీకే రుణాలందించేందుకు ఉద్దేశించిన పథకానికి అర్హులైన ప్రతీ ఒక్కరు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

## నారీశక్తి ఫిట్‌నెస్ రన్



నారీశక్తి ఫిట్‌నెస్ రన్‌లో పాల్గొంటున్న విద్యార్థినులు

కల్వకుర్తి, మార్చి 9 : కల్వకుర్తి పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల గురుకులంలో నారీశక్తి (ఫిట్‌నెస్ రన్) కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్వామివివేకానంద సేవా బృందం, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు పరుగుపందెం పోటీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ విద్యార్థినులు పట్టుదలతో కష్టపడుతూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. దేశం కోసం పోరాటం చేసిన మహిళామణులను ఆదర్శంగా తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఫిట్‌నెస్ రన్‌లో గెలుపొందిన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

## బీజేపీ మండల అధ్యక్షుడిగా యాదగిరి

వెల్దండ, మార్చి 9 : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన కుర్మిద్ద యాదగిరి నియమితులయ్యారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు యెన్నం శేఖర్‌రెడ్డి అధ్యక్షతన మండల స్థాయి బూత్‌కమిటీ సమావేశం ఏర్పాటుచేసి యాదగిరిని అధ్యక్షుడిగా నియమించారు. దళితమోర్చా జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న యాదగిరికి మండల బాధ్యతలు అప్పగించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, నాయకులు జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, జూలూరు బాలస్వామి, మట్ట పరమేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, పెద్దయ్యగౌడ్, ఆంజనేయులుగౌడ్, రామస్వామి, వెంకటేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## మంత్రి సీతక్కకు స్వాగతం పలికిన కాంగ్రెస్ శ్రేణులు

మన్ననూర్, మార్చి 9: అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు మన్ననూరు అటవీశాఖ అతిథి గృహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు శనివారం ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి హోదాలో మొదటి సారి నల్లమల పర్యటనకు వచ్చిన సీతక్కకు ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ఆయన సతీమణి జడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ అనూరాధ ఆధ్వర్యంలో మహిళలు శాలువాలు కప్పి ఘనంగా స్వాగతం పలికారు. ఆమె కాసేపు గెస్ట్ హౌస్‌లో విశ్రాంతి తీసుకొని స్థానిక సమస్యలను కార్యకర్తల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఎంపీటీసీ సభ్యులు దాసరి శ్రీనివాసులు, బాలమ్మ, కోఆప్షన్ సభ్యుడు రహీం, వైస్ ఎంపీపీ ప్రణీత, కాంగ్రెస్ నాయకులు పెర్మాల వెంకటేశ్వర్లు, సంబు వెంకటరమణ, శివాజి, జూలూరి సత్యనారాయణ, వెంకటయ్య, హన్మంత్‌రెడ్డి, లోకనాథం, రహమాన్, రమణగౌడ్ పాల్గొన్నారు.

## యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

అమ్రాబాద్, మార్చి 9: అమ్రాబాద్ మండల పరిధిలోని జంగం రెడ్డిపల్లి గ్రామంలో శనివారం సాయంత్ర అమ్రాబాద్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో పోలీసులు కమ్యూనిటీ అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రజల సహకారంతో పోలీసులు కృషి చేయనున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. విలేజ్ పోలీస్ అధికారి గ్రామస్థులు పాల్గొన్నారు.

## 13న ఉచిత కంటి చికిత్స శిబిరం

కందనూలు, మార్చి 9 : జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో బుధవారం ఉదయం 9గంటలకు ఉచిత కంటి చికిత్స శిబిరం నిర్వహిస్తున్నట్లు అప్తాలమిక్ ఆఫీసర్ బి.శివారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, ఓటరు కార్డు లేదా రేషన్‌కార్డు జిరాక్స్ కాపీని వెంట తెచ్చుకోవాలని సూచించారు.

## శనీశ్వర స్వామికి భక్తుల ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, మార్చి 9: సార్థసప్త శనీశ్వర స్వామి భక్తులు నల్లని వస్త్రాలు ధరించి నల్లని నువ్వులు, తిల తైలాలతో భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నంది వడ్డెమాన్‌లోని సార్థా సప్త జేష్ఠ దేవి సమేత శనీశ్వర స్వామికి మాఘమాసం శనివారం చతుర్థశి పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు డాక్టర్ విశ్వనాథశాస్త్రి మాట్లాడారు.